# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ధరణితో రంది తీరింది



ధరణితో భూ సమస్యలు లేకుండా శాశ్వతంగా పరిష్కారమయ్యాయి. గతంలో ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతే పనులు కాలేదు. వీఆర్వోలు ఎన్నో సార్లు వన్-బీ, పహాణీలు తారుమారు రాసిండ్రు. ప్రస్తుతం ధరణితో సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్ననయ్. సమస్య ఉంటే ధరణి ఆన్‌లైన్‌లో చలానా కట్టుకుంటే తహసీల్దార్ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్రు. ఇక భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియ క్షణాల్లో పూర్తవుతుంది. ప్రతీ రైతుకు సెల్‌ఫోన్‌లో చూసుకుంటే భూమి ఆన్‌లైన్ కనబడుతుంది. ఇలాంటి ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే మాలాంటి రైతుల బతుకులు ఆగమవుతయి.

**- బాదిరెడ్డి రాజు, రైతు, మల్కపేట(కోనరావుపేట)**

### కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతం



నాకు ఎకరం భూమి ఉండే. దాన్ని అమ్మి ఎవరికీ పైసలు ఇవ్వకుండా, దళారీ వ్యవస్థ లేకుండా ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న. కానీ గతంలో రిజిస్ట్రేషన్ అయ్యేంతవరకు భయం ఉండేది. ధరణిని తీసేసి పాత పద్ధతి తెస్తే కబ్జాదారులు, దళారులు రాజ్యమేలుతరు. పైసలకు ఆశపడి గతంలో పట్వారీలు ఒకే భూమిని ఇద్దరి పేరు మీద చేసిన దాఖలాలు ఉన్నయి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. ధరణిని తీసేస్తే భూములకు భద్రత ఉండదు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుంది. గతంలో ఎవరూ పైసలు ఇస్తే వాళ్లకు భూములను రాసేటోళ్లు. అది సవరించుకోవడానికి ఆఫీసుల చుట్టూ దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రశాంతంగా బతుకుతున్న రైతుల జీవితాల్లో నిప్పులు పోసేందుకు కాంగ్రెస్ ధరణిని తీసేస్తామంటుంది. కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతం.

**- వట్టిమల్ల రవి, రైతు, మూడపల్లి(చందుర్తి)**

### పట్వారీ వ్యవస్థ వస్తే ఆగమే

పట్వారీ వ్యవస్థ వస్తే గ్రామాల్లో రైతులు కొట్టుకచావుడే. రెవెన్యూలో దళారులు మళ్లీ ఊరికొకరు పుట్టుకొచ్చి రైతుల వద్ద నుంచి లంచాలు గుంజుడే ఉంటది. రికార్డులు తారుమారైతయ్.



ప్రశాంతంగా బతుకుతున్న రైతులు ఆగమాగమైతరు. ఎప్పుడూ ఏ రికార్డు ఎవరీ పేరు మీదకు మారుతుందో తెలియదు. ధరణి వచ్చిన తర్వాత రైతుల రికార్డులు భద్రంగా ఉన్నయి. ఒకరి భూమి ఇంకొకరి పేరు మీదకు ఎక్కాలంటే రైతు వేలిముద్ర వేయాలి. సీసీ రికార్డులో కూడా నమోదవుతది. అందుకే ధరణి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పట్వారీ వ్యవస్థ వద్దే.. వద్దే. ధరణియే కరెక్ట్. ఇంత మంచిగున్న ధరణిని తీసివేస్తామన్న కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు. ఇటువంటి నాయకులను గ్రామాల నుంచి రైతులందరూ తరిమికొడ్తరు.

**- పండగ మల్లారెడ్డి, రైతు (బోయినపల్లి)**



### మళ్లీ ఆఫీసులో సుట్టూ తిరుగుడె..

కాంగ్రెస్ హయాంలో భూములు పట్టా చేయించుకునేందుకు వీఆర్వో దగ్గరికీ ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ధరణితో సులభమైన పద్ధతిలో స్లాట్ బుక్ చేయించుకుని పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేష న్ చేయించుకుంటున్నం. దీనికితోడు ధరణితోనే రైతులకు రైతుబంధు, రైతు బీమా వస్తుంది. కాంగ్రెస్ వస్తే ధరణి, రైతుబంధు, రైతు బీమా ఉండదు. మళ్లీ రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుడే. ధరణితో భూ సమస్యలు తగ్గినయి. కాబట్టి కేసీఆర్ సారే మళ్లీ రావాలి.

**- కాపీల శంకర్, రైతు, తిమ్మాపూర్(చందుర్తి)**



### 'ధరణి'తోనే ధరలు పెరిగినయ్

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి జెయ్యవట్టె భూముల ధరలు పెరగడమే కాకుండా, రక్షణ ఉంది. నాటి కాంగ్రెస్ పాలనలో భూములకు భద్రత లేదు.ధరలు కూడా ఇంత లేవు. పహాణీలు మొత్తం తప్పుల తడకగా ఉండే. దీంతో నిత్యం గ్రామాల్లో పంచాయితీలు అయ్యేటివి. ఈ పంచాయతీలు ఠాణా మెట్లెక్కేవి. సీఎం కేసీఆర్ సార్ పుణ్యమా అని ధరణి రావడంతో ఎలాటి లోపాలు లేకుండా, భూములకు రక్షణ కల్పించిండు. భూములకు మంచి ధరలు అచ్చినయ్. గా రేవంత్‌రెడ్డి వచ్చి ధరణి రద్దు చేస్తా, పటేల్ పట్వారీ వ్యవస్థ తెస్తా అని నోటికచ్చినట్లు మాట్లాడుతున్నడు. గిలాంటి కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తం. రైతులకు మంచి చేసిన సీఎం సార్ వెంట ఉంటం. ధరణి తీసేసే కాంగ్రెస్ మాకెందుకు?

**- నేతికుంట అనిల్, రైతు, గోస్కులపల్లి(చందుర్తి)**

# ధరణి ఎత్తేస్తే దగానే

- పాత వ్యవస్థతో అన్నదాతకు తిప్పలే ● భూములకు రక్షణ కరువే ● మళ్లీ లంచగొండులు, దళారులదే రాజ్యం ● కొట్లాటలు, కేసుల చుట్టూ తిరుగుడే ● ధరణి పోర్టల్‌తోనే భూములకు విలువ
- వ్యవసాయ రంగ నిపుణుల అభిప్రాయం ● కాంగ్రెస్ మాటలపై ఆలోచన చేయాలని పిలుపు
- ఆ మోసకారి పార్టీని మేమే రద్దు చేస్తం ● బీఆర్ఎస్‌కే అండగా నిలుస్తం ● స్పష్టం చేసిన అన్నదాతలు

కరీంనగర్, నవంబర్ 28 (కరీంనగర్ ప్రతినిధి) : వ్యవసాయ భూములకు భద్రత కల్పించిన ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ దగా తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా భూముల పరిరక్షణకు ఆధునిక టెక్నాలజీ వాడుతూ.. వివాదాలకు తావులేకుండా భూములకు రక్షణ కల్పిస్తున్న నేపథ్యంలో.. ముఖ్యమంత్రి కేసీఆర్ అదే పంథాను అనుసరించారని, ధరణిని తెచ్చి, భూ వివాదాలకు చరమగీతం పాడారని గుర్తు చేస్తున్నారు. నిజాం కాలం నాటి దస్త్రాలను ఆధునీకరించడంతోపాటు డిజిటలైజ్ చేశారని, భూ వివాదాలకు పరిష్కారం చూపారని చెబుతున్నారు. ధరణిలో ఎప్పటికప్పుడు మాడ్యుల్స్ తెస్తున్నారని, చిన్న చిన్న సమస్యలను కూడా అధిగమించి.. పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ.. అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేస్తూ. కబ్జాలకు గురైన ఎన్నోభూములకు విముక్తి కల్పించి.. అసలైన యజమానులకు న్యాయం చేస్తున్నారంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే.. కలెక్టర్ పరిశీలించి పరిష్కరించే అధికారాన్ని కల్పించి, క్షేత్రస్థాయి అధికారులు పొరపాట్లు చేయకుండా ధరణి రూపకల్పన చేశారని స్పష్టం చేస్తున్నారు. ఓవైపు రాష్ట్రంలో అమలవుతున్న ధరణి పోర్టల్‌ను.. వివిధ రాష్ట్రాలు వచ్చి పరిశీలించి, ఇదే విధానాన్ని వివిధ రాష్ట్రాల్లో అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రశంసిస్తున్నారు. కాంగ్రెస్ రోజుకో తీరు చెబుతున్న మాటలపై ఆలోచన చేయాలని, మోసపోవద్దని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధరణి రద్దు చేస్తామన్న కాంగ్రెస్‌పై అన్నదాతలు భగ్గుమంటున్నారు. ఈ విషయంలో వ్యతిరేకత వస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా అదే తీరున ఒకరి వెనుక ఒకరు వ్యాఖ్యలు చేయడం చూస్తే రైతులను దగా చేసే పెద్ద కుట్ర దాగి ఉన్నదని మండిపడుతున్నారు. యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో నలభై రెండేండ్లు కాంగ్రెస్, పదాహారేండ్లు టీడీపీ పాలన చేసినా.. ఏనాడూ తమ బాధలు పట్టించుకోలేదని గుర్తు చేస్తున్నారు. తమను ఆదుకునే దిశగా ఎన్నడూ కనీస చర్యలు తీసుకోలేదని, మళ్లీ ఇప్పుడు వచ్చి అరిగోస పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్నారు. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని, భూమలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పట్వారీలు, వీఆర్‌వోలు వస్తారని, లంచగొండులు, పైరవీకారులు రాజ్యమేలుతారని, ఇక పైసలేనిదే ఏ పనికాదని, కొట్లాటలు మొదలవుతాయని భయపడుతున్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వమని, తమను కాపాడుతున్న కేసీఆర్‌కే ఓటేసి గెలిపించుకుంటామని చెబుతున్నారు.

### దళారీ వ్యవస్థ మళ్లీ వస్తది

ధరణి రద్దు చేస్తే దళారి వ్యవస్థ మళ్లీ వస్తది. పాస్‌బుక్‌లో సర్వే నెంబర్లు మారుతయి. మళ్లీ పాత వ్యవస్థ రావడం వల్ల ఇబ్బందులు వస్తయి. ధరణి ఉంటేనే మాకు బాగుంటుంది. ఎత్తివేస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు ఓటు వేయం. పాస్‌బుక్‌లో భూమి ఎక్కించుకోవాలంటే మళ్లీ పైసలు అడుగుతరు. ఇప్పుడు అందరం మంచిగా ఉన్నం. పాత రోజులు గుర్తుకు వస్తే నిద్ర పట్టదు. పాస్‌బుక్‌లో భూమి ఎక్కించుకోవడానికి అధికారులు, తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినం. ధరణి వచ్చినంకా డబ్బులు లేకుండా పాణి తీసుకుంటున్నం. ఇప్పుడు అధికారులు చుట్టు తిరిగాల్సిన పనిలేకుండానే క్షణాల్లో అయిపోతుంది. ధరణి రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతం. ఇలా గాలిమాటలు చేప్పే వాళ్లకు ఎన్నికల్లో బుద్ధి చెబుతం. కేసీఆర్ సారు మరోసారి మనకు సీఎంగా ఉంటే ఎలాంటి కష్టాలు ఉండవు.

**- మిట్టపెల్లి రాజు, శాత్రాజుపల్లి (వేములవాడ)**





### పట్వారీల అజమాయిషీ వస్తే ధీమాపోతది

గతంలో పహాణీ కావాలంటే తహసీల్ ఆఫీసు సుట్టూ నెలల తరబడి తిరిగేటోళ్లం. ఇప్పుడు మీ సేవకు పోతే ఐదు నిమిషాల్లో ఇయ్యవట్టె. ధరణి జెయ్యవట్టి మా భూమి భద్రంగ కనిపిస్తుండె. గింత మంచిగున్న ధరణిని తీసివేస్తామంటూ కాంగ్రెసోళ్లు అంటున్నరు. కొత్త కౌలుదారు చట్టం తీసుకొస్తుమంటున్నరు. వాళ్లను నమ్మేది లేదు. ఎందుకంటే గతంలో భూమి ఎవరి పేరు మీద ఉండేదో.. ఎప్పుడూ మారిపోయేదో తెలిసేదికాదు. ధరణి ఉండాలి. దానిని రద్దు చేస్తామంటే ఊరుకునేది లేదు. మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపిస్తాం. ధరణి ఎత్తేస్తే భూమికి రక్షణపోతది. మళ్ల పట్వారీల అజమాయిషీ వత్తే భూముల మీద ఇపుడున్న దీమాపోతది.

**- చంద్రగిరి లక్ష్మణ్, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)**



### కాంగ్రెసోళ్లు వచ్చుడొద్దు.. మమ్మల్ని ఇబ్బంది పెట్టుడొద్దు

కాంగ్రెస్ ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామంటున్రు. ధరణి పోర్టల్ రద్దయితే రైతుల భూములకు భద్రత ఉండదు. వారిని దళారులు దోపిడీ చేస్తారు. కౌలుదారులు, అనుభవదారుల కాలం అంటూ రెవెన్యూ వ్యవస్థను మొదటికి తెస్తరు. దీంతో రైతులు ఇబ్బందులు పడతరు. గతంలో వీఆర్‌వోలు ఒకరి భూములు మరొకరికి రాసేటోళ్లు. భూముల రికార్డుల్లో వివరాలు తారుమారు చేసేటోళ్లు. ఇప్పుడు అలాంటిది ఏమీ లేదు. ధరణి పోర్టల్‌తో భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వెంటనే అయిపోతున్నయి. ధరణితోనే బ్యాంక్ ఖాతాలో రైతుబంధు డబ్బులు పడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నరు. మళ్ల గా కాంగ్రెసోళ్లు వచ్చుడు ఎందుకు. మా రైతులను ఇబ్బంది పెట్టుడెందుకు. కాంగ్రెసోళ్లను నమ్మేదే లేదు. మాకు కేసీఆర్ సార్ కావాలి. మళ్ల బీఆర్ఎస్సే రావాలి.

**- రాసురి నర్సారెడ్డి, రైతు(రుద్రంగి)**